క్లుప్తంగా

జువ్వలపాలెంలో భగీరథ మహర్షి జయంతి



భగీరథ మహర్షి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: సగర కుల గురువు భగీరథ మహర్షి జయంతి వేడుకలను జువ్వలపాలెం గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బోధనపు వెంకటేశ్వరరావు, బోధనపు కన్నయ్య, పెద్దిరాజు, రాంబాబు, గండికోట నరసింహమూర్తి,కనకం, నక్కా శ్రీను, దొణాద్రి పర్రాజు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ



మావుళ్లమ్మవారికి బంగారం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన కె.లోవ వెంకట అప్పారావు–లక్ష్మి మాధురి దంపతులు 11 గ్రాముల బంగారం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్, సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందించారు.

వేసవి శిబిరం ప్రారంభం



సీసలి పాఠశాలలో క్యాంపు ప్రారంభిస్తున్న ఎంఈఓ రవీంద్ర

కాళ్ల: వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడం కోసం వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఎంఈఓ ఎ.రవీంద్ర అన్నారు. సీసలి ఎంపీపీ పాఠశాల (స్పెషల్)లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును ఆయన మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులు ఈ క్యాంపు ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, క్రాఫ్ట్ వంటి రకరకాల కళలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. పిల్లలు క్యాంపును ఉపయోగించుకుని చక్కగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. హెచ్ఎం అడ్డాల వెంకట సుబ్బరాజు, అనూష, బి.రాజమౌళి కోటేశ్వరస్వామి, ఎస్ఎంసీ చైర్మన్ తెనాలి అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుకల్యాణ మహోత్సవాలు ప్రారంభం



ప్రత్యేకాలంకరణలో కాళ్లకూరు వేంకటేశ్వర స్వామి

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలో ఉన్న స్వయంభు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కల్యాణ మహోత్సవంలో భాగంగా సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ధ్వజారోహణ సందర్భంగా సంతానం లేని దంపతులు సంతానం కోసం శ్రీ స్వామివారి గరుడ పొంగలి విశేష ప్రసాదాన్ని స్వీకరించారు. ఈఓ ఎం.అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మున్సిపల్ లైబ్రరీకి రూ.25 లక్షలు అందజేత



ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా చెక్ అందిస్తున్న బ్యాంక్ అధికారులు

భీమవరం: పట్టణంలోని శివరావుపేటలోని డీఎన్నార్ మున్సిపల్ లైబ్రరీ, స్పిర్చ్యువల్ సెంటర్స్ కెనరా బ్యాంక్ సీఎస్ఆర్ ఫండ్స్ రూ. 25 లక్షలు మంజూరు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ లైబ్రరీకి ఎమ్మెల్యే చేతుల మీదుగా రూ. 25 లక్షల చెక్కును బ్యాంక్ అధికారులు అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఎండీ సీఈవో కె సత్యనారాయణ, డీజీఎం ఎం.మాధవరావు, ఏజీఎం పవన్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రైవేటు దోపిడీకి అడ్డుకట్ట వేసేదెవరు?

- బుక్స్, యూనిఫామ్ ఫీజులతో బాదుడు
- ప్రకటనలకే అధికారులు పరిమితం

ఉండి: ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు అటు ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు, ,ఇటు విద్యాశాఖ అధికారులు కలిసి పని చేస్తున్నారని ఆరోపణలు పదేపదే వినిపిస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల దోపీడీకి అధికారులే అండగా ఉంటున్నారంటే అతిశయోక్తి కాదు. విద్యార్థులు తమ పాఠశాల విడిచిపోకూడదని ఒక తరగతిలో ఉండగానే కొత్త తరగతి పాఠాలు వారి బోధించేస్తున్నామని చెబుతూ బుక్స్ కోసం రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు.ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనల మేరకు బుక్స్, బ్యాగులు, యూనిఫాం అమ్మకూడదని నిబంధన ఉన్నా అవేమీ మాకు పట్టవు అన్నట్లే యాజమాన్యాలు వ్యవహరిస్తుండటం గమనార్హం. బుక్స్,బ్యాగులపై స్కూల్ పేర్లు, ఫోటోలతో సహా ముద్రించి అమ్మకాలు చేస్తున్నారు. అయితే ఇవ్వన్నీ మాకు కనిపించడం లేదని అధికారులే స్వయంగా చెబుతున్నారు.

అప్పగించినా చర్యలు నిల్

గతంలో ఎస్ఎఫ్ఐ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు కొన్ని పాఠశాల వద్ద నిరసనలు తెలిపి అధికారుల సమక్షంలో ఆయా స్కూల్స్‌లో యూనిఫాం ,బ్యాగులు, బుక్స్ వంటివి పట్టుకుని అధికారులకు అప్పగించారు. అధికారులు లాంఛనాలన్నీ పూర్తి చేసి ఆయా పాఠశాలల్లోని బుక్స్, బ్యాగులు వంటివి ఓ గదిలో పెట్టి తాళం వేసి సీజ్ చేశారు. నియోజకవర్గంలోని పలు ప్రైవేటు స్కూల్స్ బుక్స్‌కు వేసే అట్టలపై స్కూల్ పేర్లు ముద్రించుకుని అధిక ధరలకు అమ్ముతూ వాటిని తప్పని సరిగా కొనాల్సిందేనంటూ విద్యార్థులపైనా, వారి తల్లిదండ్రులపైనా తీవ్రంగా ఒత్తిడి చేసి కొనిపిస్తున్నారు.వాటితో పాటుగా అధిక ధరలకు యూనిఫాం అమ్ముతూ వారి చెప్పినన్ని జతలు కొనాల్సిందేనంటూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆదేశిస్తున్నారు. దీంతో చేసేది లేక వారి బిడ్డల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రూ.వేలల్లో,రూ.లక్షల్లోను ఫీజులు చెల్లించి తల్లిదండ్రులు దగా పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలల ఆగడాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఉండిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో అక్రమంగా నిలువ ఉంచిన పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ జ్యోతి(ఫైల్)

దోపిడీని అడ్డుకోవాలి



ప్రైవేటు పాఠశాలల్లో యాజమాన్యాలు చేస్తున్న దోపిడీని అధికారులు అడ్డుకోవాలి. నిబంధనల ప్రకారమే అధికారులు వ్యవహరించాలని కోరుతున్నాము గానీ వారిని అక్రమంగా నడుచుకోమనడం లేదు కదా. అధికారులు అధిక ఫీజులు, నిబంధనలకు విరుద్ధంగా స్కూల్‌లో జరుగుతున్న అమ్మకాలను నిలుపుదల చేయాలి.

– జి. శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా జాయింట్ సెక్రటరీ.

అధికారులకు కనిపించడం లేదా?



నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో అధిక ధరలకు బుక్స్, బ్యాగులు, యూనిఫాం అమ్మకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. ఎస్ఎఫ్ఐ పోరాటాలు చేసి విద్యార్థులకు అండగా నిలుస్తున్నా అధికారులు నిర్వీర్యం చేస్తున్నారు. స్వేచ్ఛంగా అందాల్సిన విద్య అతి ఖరీదైపోయినా అధికారులు చోద్యం చూస్తున్నారు.

– కె.రోహిత్, ఎస్ఎఫ్ఐ, ఉండి మండలాధ్యక్షుడు

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్ట్

భీమవరం: పట్టణ పరిధిలోని బీవీరాజు విగ్రహం సమీపంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వీరమల్లు భాస్కరరావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు భీమవరం ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు మంగళవారం తెలిపారు. అతని వద్ద నుంచి 7 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని తెలిపారు. దాడుల్లో ఎస్సైలు పి.ఉమామహేశ్వరరావు, పి.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

డ్రెయిన్లలో మురుగు తొలగింపు



డ్రెయిన్లలో మురుగు తొలగిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లోని డ్రెయిన్లలో పేరుకుపోయిన మురుగును గత రెండు రోజులుగా తొలగిస్తున్నారు. స్థానిక ప్రధాన రహదారి వెంబడి ఉన్న డ్రెయిన్‌లో భారీగా మురుగును బయటకు తీశారు. పలు వీధుల్లో ఆయా కౌన్సిలర్ల పర్యవేక్షణలో చైర్‌పర్సన్ జామి హైమావతి సమక్షంలో మురుగు తొలగింపు జరుగుతోంది. మంగళవారం స్థానిక జవహర్‌పేటలోనూ, మూలలంక బోదె ప్రాంతంలో మురుగు తొలగింపు చర్యలను చైర్‌పర్సన్ హైమావతి, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ గేదల అప్పారావు పరిశీలించారు. వర్షాలకు ఆయా ప్రాంతాలు ముంపుకు గురికాకుండి ముందు జాగ్రత్త చర్యగా మురుగు తొలగింపు పనులు చేపట్టినట్లు చైర్‌పర్సన్ చెప్పారు.

గృహ నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): నిర్దేశించిన గృహ నిర్మాణాల లక్ష్యసాధనలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గృహ నిర్మాణ శాఖ అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ గత సంవత్సరం జూన్ 24 నుంచి మే నెలాఖరు నాటికి 9,107 గృహ నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా 3,361 గృహాల నిర్మాణాలు మాత్రమే పూర్తి చేయడంపై తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. మిగిలిన 5721 గృహాలను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను హెచ్చరించారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌పై అవగాహన

భీమవరం అర్బన్: 18 నుంచి 59 సంవత్సరాల లోపు ఆదాయపు పన్ను పరిధిలోకి రాని, ఈఎస్ఐ, ఈపీఎఫ్ లో సభ్యత్వం లేని అసంఘటిత కార్మికులందరూ ఈ -శ్రమ్ పోర్టల్‌లో తప్పనిసరిగా సభ్యత్వం నమోదు చేయించుకోవాలని భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి అన్నారు. భీమవరం మండలంలోని కొవ్వాడ అన్నవరం గ్రామంలో సచివాలయం వద్ద మంగళవారం అసంఘటిత కార్మికుల కోసం పలు సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భీమవరం సివిల్ జడ్జి ఎమ్ సుధారాణి మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో సభ్యత్వం నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు ఎన్. సుధీర్, పి.అంబేడ్కర్, ఇన్‌ఛార్జి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కేబీఆర్ శర్మ, గ్రామ పెద్ద అల్లూరి సాయి దుర్గరాజు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

పాలకోడేరు: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మోగల్లు, శృంగవృక్షం ఏఎన్ఎంలు ధనలక్ష్మి, రత్నకుమారి సూచించారు. మంగళవారం మోగల్లులోని 29వ నంబర్ అంగన్వాడి కేంద్రం, శృంగవృక్షం చినపేట లోని 10వ నంబర్ అంగన్వాడీ కేంద్రంలో గ్రామ స్థాయి కిశోర బాలికల సమావేశాలు నిర్వహించిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మధు, స్వయం సహాయక సంఘాల వీఓఏ పెనుగుదురు బాలాకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు విమల, చంద్ర కుమారి, సుబ్బలక్ష్మి, జ్యోత్స్న పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

భీమవరం అర్బన్: బాలికలు, యువతులు బాల్య వివాహాలపై అవగాహనతో ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.కనకమహలక్ష్మి అన్నారు. మండలంలోని తుందుర్రులో గ్రామంలోని మూడో నెంబర్ అంగన్ వాడీ కేంద్రంలో మంగళవారం వేసవి సెలవులు నేపథ్యంలో 11 నుంచి 18 సంవత్సరాల కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వి.కనకమహలక్ష్మి, ఏఎన్ఎం జ్యోతి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. బాల్య వివాహాలు చేసుకుంటే కలిగే అనర్థాల గురించి వివరించి అలా ప్రేరేపించే వారిపై తీసుకోవాల్సిన చర్యలు గురించి స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది ఎం. వజ్రకుమారి, ఎస్.కనకదుర్గ, ఐ.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



పాలకోడేరు: మోగల్లులో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాల ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని పురాతన దేవాలమైన భీమవరం శ్రీరామలింగేశ్వర స్వామి (సుబ్బారాయుడు గుడి) దేవస్థాన పునః ప్రతిష్ఠ మహోత్సవ పూజా కార్యక్రమాలు మంగళవారం సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 8న ఉదయం 6.55 నిమిషాలకు బ్రహ్మశ్రీ రుద్రపాక శివశ్రీను శర్మ బ్రహ్మత్వంలో రామలింగేశ్వర స్వామి దేవస్థాన పునః ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం అర్చకులచే గోపూజ, గణపతిపూజ, దీక్షా ధారణ, అఖండ స్థాపన, రుత్వికవరుణ, నీరాజన మంత్ర పుష్పాలతో వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. 8న నిర్వహించే దేవస్థాన పునః ప్రతిష్ఠ మహోత్సవానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు దేవస్థాన పునః నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.



ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ బ్యాంకులు ఏర్పాటు చేయాలి

భీమవరం: జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ బ్యాంకులు ఏర్పాటు చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజుజిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఎ నాగేంద్ర వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో లీడ్‌బ్యాంక్ మేనేజర్‌ను కలిసి గంగరాజు మాట్లాడుతూ జిల్లాలో సర్వే చేసి అవసరమైన చోట గ్రామీణ ప్రాంతాల్లో నూతన జాతీయ బ్యాంక్ బ్రాంచ్‌లను ఏర్పాటు చేసి రైతులు, వ్యాపారస్తులకు అధిక వడ్డీ భారం నుంచి విముక్తి కలిగించాలన్నారు. నరసాపురం మండలంలోని తూర్పు తాళ్ళు, వేములదీవి, పెద మైనవానిలంక, సీతారామపురం, చిట్టవరం, నవరసపురం, మొగల్తూరు మండలంలో కెపీ పాలెం, శేరేపాలెం, కాళీపట్నం, భీమవరం మండలంలో దిరుసుమర్రు, దెయ్యాలతిప్ప, గూట్లపాడు, లోసరి, బేతపూడి, తుందుర్రు తదితరప్రాంతాలతోపాటు జిల్లాలో ఇతర ప్రాంతాలలో కూడా పరిశీలించి బ్యాంక్‌లు ఏర్పాటు చేయాలని గంగరాజు కోరారు.



భీమవరంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ నాగేంద్రవరప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న గంగరాజు

వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఆకివీడు: వృద్ధులకు అన్నింటా ప్రాధాన్యతనివ్వాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ జీ.గీతాబాయ్ పిలుపునిచ్చారు. స్థానిక సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 100 మంది వృద్ధులకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వద్ద వృద్ధులకు వైద్యం అందజేయడంలో మొదటి ప్రాధాన్యతగా చూడాలని సూచించారు. వృద్ధుల సంక్షేమ సంఘం గౌరవధ్యక్షులు డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు, విభిన్న ప్రతిభావంతుల ఉమ్మడి జిల్లా సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్, దాతలు డాక్టర్ జంపన వెంకట సుబ్బరాజు, జంపన అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

జీఓ-77ను రద్దు చేయాలి

భీమవరం: పీజీ విద్యార్థులు పాలిట శాపంగా మారిన జీఓ 77 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ విభాగ కన్వీనర్ కాయిత డిన్నుచందు మాట్లాడుతూ జీఓ 77 కారణంగా పేద, మధ్య తరగతి విద్యార్థులు పీజీ విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీఓ రద్దుపై విద్యాశాఖామంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ అధికారంలోనికి వచ్చి ఏడాది కావస్తున్నా అమలుచేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాయి వెంకట్, పట్టణ కార్యదర్శి రత్నాల జగదీష్ సహాయ కార్యదర్శి సాయికృష్ణ, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

నరసాపురం: నరసాపురం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో మంగళవారం పిల్లలకు నీతి కథలు చెప్పారు. అలాగే పిల్లలతో తెలుగు అధ్యాపకులు పద్యాలు చదివించారు. తెలుగు టు ఇంగ్లీష్ ట్రాన్స్‌లేషన్, యోగా, చెస్ వంటి ఆటలు నేర్పించారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులకు మంచి స్పందన వస్తోందని, ప్రతిరోజూ తరగతులకు వచ్చేవారి సంఖ్య పెరుగుతుందని లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి చెప్పారు.

పదో తరగతి విద్యార్థులకు సత్కారం



విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న దృశ్యం



విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి, డీఈఓ నారాయణ

భీమవరం: క్రమశిక్షణ, ఏకాగ్రత కలిగి ఉంటే విద్యార్థులు ప్రతిభవంతులుగా గుర్తింపు పొందుతారని రాజ్యసభ సభ్యుడు పాక వెంకటసత్యనారాయణ, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం త్యాగరాజ భవనంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 124 మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో 124 మంది టెన్త్, ఇంటర్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను, మెడల్స్‌ను దాతల సహకారంతో అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి, మెంటే పార్థసారధి, గన్నాబత్తుల శ్రీనివాస్, వబిలిశెట్టి రామకృష్ణ, గంధం శ్రీదేవి, అరసవల్లి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సామాజిక స్పృహ

భీమవరం: ప్రభుత్వ పాఠశాల్లో చదివిన విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి, విపత్కర పరిస్థితులు ఎదుర్కొనే సామర్థ్యం కలిగి ఉంటారని ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. మంగళవారం భీమవరం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో భీమవరం, పాలకోడేరు మండలాల్లో టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా గోపిమూర్తిమాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఉత్తమమైన ఫలితాలు సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి ఏకేవి రామభద్రం, పాలకోడేరు మండల విద్యాశాఖాధికారులు నాగరాజు, శ్రీమన్నారాయణ, భీమవరం ఎంఈఓ వేంద్ర వెంకటేశ్వరరావు, సీహెచ్ పట్టాభి రామయ్య పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్స్ డ్రైవ్‌లో 1,502 మంది ఎంపిక

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 1502 మంది అత్యధిక ప్యాకేజీలతో సాఫ్ట్‌వేర్, కోర్ గ్రూపుల్లో ఉద్యోగాలు సాధించారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ చెప్పారు. మంగళవారం కళాశాలలో విలేకర్ల సమావేశంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో కళాశాల విద్యార్థులు సాధించిన ప్లేస్‌మెంట్స్ వివరాలు వెల్లడించారు. ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ విద్యార్థులు 949 మంది అత్యధిక వేతనం రూ 17.1 లక్షల నుంచి యావరేజ్‌గా రూ. 3.5 లక్షలు వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ కళాశాలలో 45 ఐటీ కంపెనీలు, 34 కోర్ గ్రూప్ కంపెనీలు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాయన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు, ప్లేస్‌మెంట్ సెల్ డీన్ కేఆర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌కేఆర్‌లో ప్లేస్‌మెంట్ డ్రైవ్ వివరాలను వెల్లడిస్తున్న దృశ్యం

విద్యాప్రదాత దంతులూరి నారాయణరాజు



నారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: దంతులూరి నారాయణ రాజు (డీఎన్నార్) విద్యా సంస్థల్లో ఎంతోమంది విద్యార్థులకు విద్యాదానం చేసిన విద్యా ప్రదాత దంతులూరి నారాయణ రాజు అని హెచ్ఎం బి.రాధామణి అన్నారు. మండలంలోని అనాకోడేరు గ్రామంలో దంతులూరి నారాయణ రాజు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో దంతులూరి నారాయణ రాజు 127 జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాధామణి మాట్లాడుతూ దంతులూరి నారాయణరాజు విద్యా సంస్థల ద్వారా లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి వివిధ రంగాలలో రాణిస్తున్నారన్నారు. ముందుగా దంతులూరి నారాయణ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రథమ సహాయకుడు రేపాక వెంకన్నబాబు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు, ఎస్ఎంసీ చైర్మన్ సుంకర పరమేశ్వరరావు, ఉపాధ్యాయులు జి. నర్మద, ఎస్ దుర్గా వర ప్రసాద్, కె.రాజేష్ కుమార్ రాజు పాల్గొన్నారు.